క్లుప్తంగా

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నార్కట్‌పల్లి: మండలంలో ఒక జెడ్పీటీసీ, 15 ఎంపీటీసీ స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ ఉమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు అందజేయాలని, రైతు వేదిక వద్ద 5 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు..

ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ



టీవీని అందజేస్తున్న పృథ్వీరాజ్

చిట్యాల: మండలంలోని వనిపాకల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పీక పృథ్వీరాజ్ 43 ఇంచుల టీవీని బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల ఆగడాలను అరికట్టాలి

కనగల్: రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి అన్నారు. కనగల్‌లో బుధవారం రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు మద్దతు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. క్వింటా వరి ధాన్యానికి రూ.1600 నుంచి రూ.1700 చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీఏ మెంబర్ కూసుకుంట్ల రాజారెడ్డి, కదిరె నాగరాజు, సైదులు, జానయ్య, ఏమిరెడ్డి నాగిరెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

'సీజేఐపై దాడి సిగ్గుచేటు'

నల్లగొండ టౌన్: కోర్టు ఆవరణలోనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం సిగ్గుచేటని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి.. భారత రాజ్యాంగంపై జరిగిన దాడే అని అన్నారు. ఈ సమావేశంలో పాలాది కార్తీక్, ఎడ్ల తరుణ్, కుమార్‌నాయక్, కిరణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునుగోడు: మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామానికి చెందిన అందుగల కుశ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుశ అంత్యక్రియల నిమిత్తం డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పంపిన రూ.10వేల నగదును ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ పంతంగి పద్మస్వామి, జాజుల స్వామిగౌడ్, జాజుల శంకర్, జీడిమెట్ల ముత్యాలు, అందుగుల యాదయ్య, జాజుల రవి తదితరులు పాల్గొన్నారు.

ఒడిబియ్యం సమర్పణ

నకిరేకల్ : దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో నకిరేకల్ పట్టణంలోని శ్రీ కనక దుర్గ ఆలయంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆలయంలో పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, ఆలయ చైర్మన్ కందాల సత్తిరెడ్డి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

శాలిగౌరారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల ప్రజల్లో అభిమానం తగ్గలేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమతో కలిసివచ్చే పార్టీలతో జట్టు కట్టి ప్రాబల్యం ఉన్నచోట పోటీలో నిలుస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, దాసరి దేవచిత్తం, మక్క బుచ్చిరాములు, ఎర్ర రమేష్, కారింగుల వెంకన్న, ఇస్మాయిల్, అన్నెబోయిన కిరణ్, డెంకెల లింగయ్య, గుండ్లపల్లి వెంకన్న, బట్ట అవనిజ పాల్గొన్నారు.

తీరనున్న వాహనదారుల కష్టాలు



డబుల్ రోడ్డుగా మారనున్న ఇడికూడ రోడ్డు



తేరట్‌పల్లి గ్రామ శివారులో పూర్తయిన కల్వర్టు

- ఇడికూడ–సంస్థాన్ నారాయణపురం రోడ్డుకు గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభం

గట్టుప్పల్ : ఎన్నో ఏళ్లుగా సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారుల కష్టాలు ఇక తీరనున్నాయి. చండూరు మండలం ఇడికూడ గ్రామ ఎక్స్ రోడ్డు నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. మొదటి దఫా రూ.30 కోట్లు మంజూరు కావడంతో చండూరు మండలం ఇడికూడ నుంచి గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామ శివారు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 15 కల్వర్టులకు గాను 13 పూర్తి చేశారు. మరో రెండు కల్వర్టుల నిర్మాణ పనులు మొదలుకానున్నాయి. రోడ్డును ఎత్తుగా నిర్మించేందుకు మట్టి అవసరం ఉన్నందున పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని.. మట్టిని గుర్తించి అప్రూవల్‌కు జిల్లా అధికారులకు పంపించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. అప్రూవల్ రాగానే నెల రోజుల్లో రోడ్డు పనులు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సంబంధిత ఏఈ తెలిపారు.

సింగిల్ రోడ్డు కావడంతో..

చండూరు మండలం ఇడికూడ గ్రామ ఎక్స్ రోడ్డు నుంచి సంస్థాన్ నారాయణపురం వరకు సింగిల్ రోడ్డు కావడంతో వాహనదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో వివిధ పనుల నిమిత్తం చండూరు మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లడానికి 25 కిలోమీటర్ల దూరం.. గంటకుపైగా సమయం పడుతోంది. రోడ్డుపై గుంతలు ఉండడంతో ఆర్టీసీ బస్సులు సమయానికి రాక ప్రయాణికుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

రెండో దఫా తేరట్‌పల్లి నుంచి సంస్థాన్ నారాయణపూర్ వరకు పనులు చేసేందుకు అదనపు నిధుల కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచన మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. నిధులు మంజూరు కాగానే రెండో దఫా పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

గ్రామాల్లో రోడ్డుకు రెండు వైపులా 50 ఫీట్ల వరకు..

రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామాల్లో రోడ్డుకు రెండువైపులా 50 ఫీట్ల వరకు వెడల్పు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మొదట 66 ఫీట్ల వరకు అనుకున్నా.. గ్రామాల్లో అనేకమంది పేదలకు నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు అధికారులు 50 ఫీట్లకు కుదించారు. ఊరు చివర నుంచి యథావిధిగా 66 ఫీట్ల వరకు రోడ్డును వెడల్పు చేయనున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు.. సైడ్ డ్రెయినేజీలు, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పుల్లెంల గ్రామంలో మార్కింగ్ చేసి రోడ్డు హద్దులకు లోపల ఉన్న కట్టడాలను తొలగించాలని సంబంధిత ఇళ్ల యాజమానులకు అధికారులు నోటీసులు అందజేశారు. ఇక కొండాపురం గ్రామంలో ఇళ్ల యజమానులకు నోటీసులు అందించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

"సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు పనులు ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలి. ఇప్పటికే సింగిల్ రోడ్డుతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. చండూరుకు వెళ్లి రావడానికి ఒక రోజంతా పడుతోంది.

–పున్న కిశోర్, గట్టుప్పల్

"పనులు వేగంగా చేయిస్తాం



ఇడికూడ నుంచి తేరట్‌పల్లి వరకు పనులు మొదలయ్యాయి. ఇప్పటికే 15 కల్వర్టులకు గాను 13 కల్వర్టుల పనులు పూర్తి చేయించాం. మిగిలిన రెండు కల్వర్టుల పనులు మొదలుకానున్నాయి. రోడ్డును ఎత్తు లేపేందుకు మట్టి అవసరం ఉన్నందున మట్టిని గుర్తించి ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపించాం. అనుమతి రాగానే పనులు వేగంగా చేయిస్తాం.

–శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

నల్లగొండ టూటౌన్ : ఆస్తి పన్ను వంద శాతం వసూలయ్యే విధంగా బకాయిదారులకు సంబంధించిన సమగ్ర వివరాలతో కార్యాచరణ ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆస్తి పన్నుపై సమీక్ష నిర్వహించారు. ఏ వార్డులో ఎంత మంది ఆస్తి పన్ను బకాయి పడ్డారు.. ఎవరి ఇంటి పన్ను తక్కువ ఉంది, ఎవరు పన్ను చెల్లించడంలేదు అనే వివరాలు పూర్తిగా వార్డు ఆఫీసర్ల వద్ద ఉండాలని సూచించారు. ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేసేవిధంగా శ్రద్ధ పెట్టాలన్నారు. బకాయిలు ఎక్కువగా ఉన్నందున ప్రతి వార్డు ఆఫీసర్ ఉదయం ఏడు గంటలకే వార్డులకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. ఆస్తి పన్ను వసూలులో వార్డు ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ శివరాంరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల ఎదుట బాధితుల ఆందోళన

నల్లగొండ టౌన్: గర్భంలోనే పసికందు మరణించిన సంఘటన బుధవారం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. దీనికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బాధితురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో టూటౌన్ పోలీసులు వచ్చి ఆందోళన విరమింపజేయించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన రేణుక 8 నెలల గర్భంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం ఉదయం వచ్చింది. నొప్పులు వస్తున్నాయని తనను అడ్మిట్ చేసుకోవాలని వైద్యులను ఆమె కోరింది. గత రిపోర్టులు, స్కానింగ్ వివరాలు పరీక్షించిన వైద్యులు.. కాన్పు తేదీ డిసెంబరులో ఉండడంతో నొప్పులకు మందులు రాశారు. కాన్పు అయ్యేందుకు సమయం ఉన్నందున వారం ముందు రావాలని ఆమెకు సూచించారు. అనంతరం రేణుక ఉదయం 9 గంటలకు వెళ్లి టిఫిన్ చేయగానే నొప్పులు రావడంతో ఆస్పత్రికి వచ్చింది. స్పందించిన డాక్టర్లు ఆమెకు స్కానింగ్ చేయగా కడుపులో బిడ్డ చనిపోయిందని నిర్ధారణ చేశారు. శిశువును బయటకు తీయకుంటే తల్లి ప్రాణానికి హాని ఉందని, ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. తల్లి క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి తెలిపారు. ఆమెకు ఎలాంటి వైద్య పరీక్ష చేయలేదని, మంగళవారం నాడే కడుపులో శిశువు మృతి చెందిందని వివరించారు.

డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ..

నల్లగొండ టౌన్ : తమ కుమారుడి మృతికి డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాలుడి బంధువులు ప్రకాశం బజార్‌లోని ప్రైవేటు పిల్లల ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాలుడి తండ్రి గణేశ్ బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ గ్రామానికి చెందిన దొండ గణేశ్, శిరి దంపతుల నెలన్నర బాబుకు జ్వరం రావడంతో మంగళవారం రాత్రి ప్రకాశం బజార్‌లోని అనురాగ్ పిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాత్రి బాలుడిని పరీక్షించిన డాక్టర్.. చికిత్స చేసి ఆస్పత్రిలోనే ఉంచాలని సూచించారు. బుధవారం ఉదయం వచ్చిన డాక్టర్.. బాలుడిని పరీక్షించి పరిస్థితి సీరియస్‌గా ఉందని ఐసీయూలో వెంటిలేషన్‌పై ఉంచాలని చెప్పి రూ.15 వేల ఫీజు కట్టించుకున్నారు. ఫీజు చెల్లించిన తరువాత బాలుడు చనిపోయాడని డాక్టర్ తమకు చెప్పారన్నారు. బాలుడి మృతికి పూర్తి బాధ్యత డాక్టరే అని వారు ఆరోపించారు. ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చచెప్పి ఆందోళన విరమింపజేయించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నకిరేకల్ : మంగళపల్లిలో ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది



మునుగోడు: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లావణ్యకుమారి

గట్టుప్పల్ : విటమిన్లు కలిగి ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఐరన్, క్యాల్షియం, ఖనిజ లవణాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివేషా, హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు లింగయ్య, అంగన్‌వాడీ టీచర్లు వనజ, సంతోష, ఆశావర్కర్లు సునిత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకుంటే పుట్టిన చిన్నారులు, పుట్టబోయే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ లావణ్యకుమారి అన్నారు. పోషణ మాసంలో భాగంగా బుధవారం మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్థానికంగా లభించే ధాన్యాలు, ఆకు కూరలతోనే పౌష్టికాహారం సమకూర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి మానస, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గట్టుప్పల్ : బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలి

నకిరేకల్ : ప్రభుత్వం శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న వివిధ పోషక పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అస్రా అంజుమ్ కోరారు. పోషణ మాసంలో భాగంగా నకిరేకల్ మండలం మంగళపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, వైద్య అంగన్‌వాడీ సిబ్బంది రామేశ్వరి ప్రేమలత, కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో ప్రతిభ

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల భారతీయ సంప్రదాయక యోగాసన పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి స్థానంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ దేవరకొండ, రన్నరప్‌గా భువనగిరి సోషల్ వెల్ఫేర్ ఆర్మీ బాలికల కళాశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో స్పోర్ట్స్' బోర్డు సెక్రటరీ హరీష్‌కుమార్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

నకిరేకల్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో లావాదేవీలు జరిపి బ్యాంక్ పురోభివృద్ధికి సహకరించాలని బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ సునిల్ కుమార్ చుఘ్, సర్కిల్ హెడ్ అర్వింద్ కల్రా కోరారు. నకిరేకల్ పట్టణంలోని తిప్పర్తి రోడ్డులో నూతనం ఏర్పాటు చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. నకిరేకల్ ప్రాంత ప్రజలు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్సంబంధాలు ఉండాలి

కట్టంగూర్ : కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలు ఉండాలని కట్టంగూర్ మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని సాందీపని పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ వెల్నెస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సరైన ఆహారపు అలవాట్లు, రోజువారీ వ్యాయామంతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, సహాయ కార్యదర్శి బసవోజు వినోద్‌కుమార్, కోశాధికారి పి.రాములు, సభ్యులు ఆకవరపు బ్రహ్మచారి, గట్టిగొర్ల యాదగిరి, రేణుక, పద్మ, మంగ, పావని, ఆకాంక్ష, శ్రీలేఖ, శ్రీలేఖ్య పాల్గొన్నారు.

'అడ్డగోలు హామీలతో మోసం చేసిన కాంగ్రెస్'

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలతో ప్రజలను నిలువునా మోసం చేసిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పిలుపుమేరకు నలగాటి ప్రసన్నరాజ్ ఆధ్వర్యంలో బుధవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం కోసం బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వంటిపాక సుందర్, చౌగోని శంకర్, చెరుకు వెంకటాద్రి, వెంకటాచారి, తడిసిన సైదిరెడ్డి, పాలడుగు ఏసు, చింతమల్ల శ్రీనివాస్, తప్పెట్ల నర్సయ్య, సాకుంట్ల సైదులు, వంటెపాక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి : రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిప్పర్తి ధాన్యం కొనుగోలు కేంద్రానికి గత సంవత్సరం 75,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందన్నారు. ధాన్యం 17 శాతం తేమ మించకుండా రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ధాన్యం అమ్మిన రైతుకు 72 గంటల్లోపు నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. జిల్లా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు డ్రయర్‌లను ఏర్పాటు చేయగా.. ఒకటి తిప్పర్తిలో, రెండోది మిర్యాలగూడలో ఏర్పాటు చేశామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. బుధ, గురువారాల్లో జిల్లాలో 100 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమయ్యే టార్పాలిన్లు, తూర్పార పట్టే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలను ముందుగా పంపించామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2369 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సన్న ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వనుందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశం, డీసీఓ పాత్యానాయక్, డీఎం గోపికృష్ణ, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తహసీల్దార్ రామకృష్ణ, ఏపీఎం హరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంలో తేమ శాతం వచ్చేలా చూసుకోవాలి

రామగిరి(నల్లగొండ): రైతులు ధాన్యంలో 17 శాతం తేమ వచ్చేలా చూసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. నల్లగొండ మండలంలోని తొరగల్లు, మేళ్ల దుప్పలపల్లి, కుదావన్‌పూర్, నర్సింగ్‌బట్ల, పెద్ద సూరారం, చిన్న సూరారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వీరయ్య, ఏపీఎం వినోద, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప, సిబ్బంది గీత, శంకర్, రమేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



రామగిరి(నల్లగొండ): మేళ్ల దుప్పలపల్లిలో ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ



చిట్యాల : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానిటరింగ్ ఆఫీసర్ జ్యోతిర్మయి



కట్టంగూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పుష్పలత

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

కనగల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధరను పొందాలని డీఆర్‌డీఓ వై. శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండలంలోని లింగాలగూడెం, పర్వతగిరి, కనగల్, జి.యడవల్లి, కురంపల్లి, గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీరియల్ పాటించి నిబంధనల మేరకు 40.7 కిలోల చొప్పున ధాన్యం బస్తాలను కాంటా వేయాలన్నారు. అదేవిధంగా అమ్మగూడెం, ఎం.గౌరారం, కనగల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ బి.పద్మ, ఎంపీడీఓ కె.సుమలత, ఏపీఎం దాసరి మైసేశ్వర్‌రావు, రాయల రాజేశ్వరి, విజయ, ప్రభాకర్, ఇద్దయ్య పాల్గొన్నారు.

కట్టంగూర్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుష్పలత అన్నారు. బుధవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని రాంనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ఏ గ్రేడుకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలని, లారీల, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు, సివిల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి, కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ బండ మల్లారెడ్డి, చెరుకు చంద్రయ్య, శంకర్, కానుగు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల మండలంలో..

చిట్యాల: మున్సిపాలిటీ కేంద్రంతోపాటు, ఉరుమడ్ల గ్రామంలో చిట్యాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సహకార శాఖ మానిటరింగ్ ఆఫీసర్ జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాలు, మట్టి లేకుండా నిబంధనల మేరకు ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ సీఈఓ బ్రహ్మచారి, సిబ్బంది నాగరాజు, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, నరేష్, ధరణీధర్, రైతులు పాల్గొన్నారు.

రోగికి అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



శస్త్ర చికిత్స చేయించుకున్న రోగితో డాక్టర్

నల్లగొండ: శ్వాస తీసుకునే లోపంతో బాధపడుతున్న తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన బొంత వెంకన్న 45 సంవత్సరాల వయసు గల రోగికి నల్లగొండ పట్టణంలోని స్కంద లైఫ్‌లైన్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి వైద్యులు బుధవారం తెలిపారు. శ్వాస తీసుకోవడంలో రోగి తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆస్పత్రిలో చేరడంతో ఐసీయూలో చేర్చామన్నారు. వైద్య పరీక్షలు చేసిన అనంతరం సీఈసీటీ థోరాక్స్ స్కాన్లో మెసోథెలియోమా ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. డాక్టర్ కొత్తమాసు సోంబాబు ఆధ్వర్యంలో బుధవారం శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి 2 లీటర్ల రక్త మార్పిడి చేశారని, రోగి ఆరోగ్యం చాలా మెరుగు పడిందని వివరించారు.

21న దీపావళి నోములు

నకిరేకల్ : దీపావళి నోములు ఈ నెల 21న జరుపుకోవాలని గాయిత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ నకిరేకల్ నియోజకవర్గ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం నకిరేకల్ పట్టణంలోని సాయి మందిరంలో గాయిత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ నియోజకవర్గ కమిటీ సమావేశంలో దీపావళి పండుగ తేదీలను ప్రకటించారు. 20న సోమవారం ఉదయం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు దీపావళి నోముల మంగళహారతులు నివాళీలు తీసుకుని ధనలక్ష్మీ పూజలు చేయాలన్నారు. 21న అమవాస్య కేదారేశ్వర స్వామి నోములు జరుపుకోవాలని సూచించారు.గాయిత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశ్వరశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు పగిడిమర్రి మధుసూదన్ శర్మ, దుర్గి మురళీధర్ శర్మ, వావిలాల రామలింగేశ్వర శర్మ, నందిభట్ల సోమశేఖర్‌శర్మ, నవీన్‌శర్మ, కాటేపల్లి శ్రీనివాస్‌శర్మ, నారాయణ చంద్రమౌళిశర్మ, శ్రీనివాస్ శర్మ, ఈదులవాడ ఆనంద్, నిడిగొండ గౌతమ్, నందిభట్ల భరద్వాజ్, పగిడిమర్రి ఫణిశర్మ పాల్గొన్నారు.

ఐకేపీ సెంటర్లకు చేరిన ధాన్యం

నార్కట్‌పల్లి: రైతులు పండించిన వరి ధాన్యం ఐకేపీ సెంటర్‌లలోకి చేరింది. కానీ బుధవారం కూడా నార్కట్‌పల్లి మండలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తుండడం వల్ల ఐకేపీ సెంటర్లు ప్రారంభం కాకపోవడంతో దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్మాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.సంబంధిత అధికారులు నిర్లక్ష్యంతో ఐకేపీ సెంటర్లు నేటికీ ప్రారంభం కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా అమ్మనబోలు గ్రామంలో వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసుకుని దళారులు ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1800 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా నార్కట్‌పల్లి, అక్కెనపల్లిలో మిల్లర్లు తక్కువ ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.



నార్కట్‌పల్లి ఐకేపీ సెంటర్‌లో ధాన్యం ఆరబెడుతున్న రైతులు